

మూడు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న జడ్పీ మాజీ సీఈవో (ఎఫ్ఏసీ) ప్రభాకర్‌రెడ్డిపై వేటు పడింది. వైసీపీ ప్రభుత్వంలో.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆయన ఎట్టకేలకు సస్పెండయ్యారు. ఈ మేరకు గురువారం పంచాయతీరాజ్‌శాఖ కమిషనరు కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. - చిత్తూరు రూరల్

- ఎట్టకేలకు జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్
- విచారణ పూర్తయ్యేవరకు హెడ్‌క్వార్టర్ విడిచి వెళ్లకూడదని ఆదేశం
- ఉత్తర్వులు జారీ చేసిన పీఆర్ కమిషనర్

పదవీ విరమణలోపే వేటు

బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా రెగ్యులర్ పోస్టులో ఉన్న ప్రభాకర్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లాలోనే అత్యంత జూనియర్ అధికారి. ఏ మాత్రం అర్హత లేకున్నా చిత్తూరు జిల్లా పరిషత్తు సీఈవో పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో సుదీర్ఘంగా కొనసాగారు. అంతే కాకుండా, సీఈవోతో పాటు డిప్యూటీ సీఈవో, ఏవోగా మూడు పోస్టుల్లోనూ ఏకకాలంలో కొనసాగారు. వాస్తవానికి ఈయనకు ఏవో పోస్టుకు మాత్రమే అర్హత ఉంది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో మూడు పోస్టుల్లోనూ కొనసాగారు. ఎన్నికల కోడ్ వచ్చాక మాత్రమే ఆయన్ను ఆ పోస్టులో నుంచి తప్పించగలిగారు. అప్పుడు కూడా ఎంపీడీవోగా కాకుండా మైనార్టీ కార్పొరేషన్ ఈడీగా జిల్లా పోస్టులో కూర్చొబెట్టారు. ఈయన గురించి మొత్తం తెలిసినా, పెద్దిరెడ్డి వెనుక ఉన్నారనే కారణంగా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేకపోయారు.



ప్రభాకర్‌రెడ్డి

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.

సుదీర్ఘంగా శాసించిన వైనం

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా జడ్పీలో హవా మాత్రం ప్రభాకర్‌రెడ్డిదే. దీంతో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. జడ్పీలో ఆయన అనుభవించని పదవంటూ లేదనే చెప్పాలి. 2008 నుంచి 2017 వరకు పదేళ్ల పాటు జడ్పీలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత 2017లో ఎంపీడీవోగా పదోన్నతితో బైరెడ్డిపల్లెకి బదిలీ అయ్యారు. అయినా, డిప్యుటేషన్‌పై మళ్లీ జడ్పీకి వచ్చి ఓఎస్డీగా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆయన్ను ఆపేవారే లేకుండా పోయారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో ఏక కాలంలో జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన ఘనత అయనది. ఆ సమయంలో జడ్పీని ఆయన కనుసన్నల్లో శాసించారు.

ఉద్యోగులపై వేధింపులు

జూనియర్ మోస్ట్ ఎంపీడీవో జడ్పీ సీఈవో ఏంటని ప్రశ్నించిన ఒక్కో అధికారిని వేధించడం మొదలుపెట్టారు. కిందిస్థాయి రికార్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీవో వరకు ఎవరినీ వదిలి పెట్టలేదు. ఆయన మాటకు ఎదురు చెప్పిన వారందరినీ ఒక ఆట ఆడుకున్నారు. రాత్రిళ్లు 11 గంటల వరకు కార్యాలయంలో ఉంచి పని చేయించేవారు. ప్రభాకర్‌రెడ్డి వేధింపుల కారణంగా జిల్లాలోని నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ప్రాణాలు కోల్పోయారని సాక్షాత్తు జడ్పీ ఉద్యోగులే పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

టీడీపీ నేతలే టార్గెట్‌గా బిల్లుల పెండింగ్

టీడీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్ని ఈయన మంజూరు చేయకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీని కారణంగా అప్పులకు వడ్డీలు పెరగడంతో కొంత మంది సర్పంచులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక టీడీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లను ఆయన టార్గెట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో వీరికి ఒక్క బిల్లు కూడా మంజూరు చేయలేదు. అప్పులకు వడ్డీలు కట్టలేక అనేక మంది కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆర్డర్లను కూడా లెక్క చేయకుండా బిల్లుల్ని నిలిపేశారు. కోర్టు కేసులు కోసం రూ.లక్షలు వెచ్చించాల్సి వచ్చిందని కాంట్రాక్టర్లు, సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

భారీగా జడ్పీ నిధుల దుర్వినియోగం

ప్రభాకర్‌రెడ్డి హయాంలోనే జడ్పీలో భారీఎత్తున నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాల సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. 2005 నుంచి 2014 వరకు బీఆర్‌జీఎఫ్ నిధులు, 2005 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘం నిధులు ఏటా జడ్పీకి మంజూరయ్యాయి. ప్రభుత్వ ఖాతాలకు జమయ్యే ఈ నిధుల్ని ప్రభాకర్‌రెడ్డి సేవింగ్స్ ఖాతాలకు మళ్లించేవారని, వడ్డీ డబ్బులే రూ.వంద కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆ వడ్డీ డబ్బుల్ని ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా సొంతానికి, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అవసరాలకు వాడినట్లు ఆరోపణలున్నాయి.

సుదీర్ఘ పోరాటం : జడ్పీలో పనిచేసిన విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు, చిత్తూరు రూరల్ మండలానికి చెందిన టీడీపీ నేత కాండ్ర రమేష్‌నాయుడు జడ్పీలోని అక్రమాల గురించి కొన్నేళ్లుగా పోరాడుతూ.. సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. వీరికి తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేత చంద్రప్రకాష్, సురేంద్రకుమార్ తదితరులు ఇటీవల కుప్పంలో సీఎం చంద్రబాబుకు, ఆయన సెక్రటరీ ప్రద్యుమ్నకు ప్రభాకర్‌రెడ్డి మీద ఫిర్యాదు చేశారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కూడా ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. కనకరాజులు నాయుడు మాత్రం ప్రభాకర్‌రెడ్డి అవినీతి గురించి సాక్ష్యాలు సంపాదించడంలో ముఖ్య భూమిక పోషించారు.

విచారణకూ ఆదేశం

ఈనెలాఖరులో పదవీ విరమణ చేయాల్సిన జడ్పీ మాజీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డిని ప్రభుత్వం సస్పెండు చేయడంతో పాటు విచారణకూ ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదనీ పేర్కొంది. సీఈవోగా పనిచేసిన కాలంలో ఈయనపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఇతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టీడీపీ నాయకులు, జడ్పీలోని ప్రస్తుత, విశ్రాంత అధికారులు సాక్ష్యాలతో సహా సంబంధిత అధికారులకు అనేకమార్లు ఫిర్యాదులు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈయన్ను కాపాడుకుంటూ వచ్చారు. కనీసం విచారణ కూడా జరగకుండా చూసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సస్పెండయ్యారు.

బద్దలవుతున్న పెద్దిరెడ్డి కంచుకోట

- పుంగనూరు మున్సిపాలిటీలో సడలిన పట్టు
- టీడీపీలో చేరనున్న పలువురు కౌన్సిలర్లు, నేతలు
- ఎమ్మెల్యేగా గెలిచినా పుంగనూరుకు రాలేని పరిస్థితి

పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15న టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు. దీంతో తన పుంగనూరు పర్యటనను ఎమ్మెల్యే వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

పదవులు ఇచ్చి పవర్ తీసేసుకున్నారంటూ మున్సిపల్ చైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేశారు. మరికొందరితో కలిసి త్వరలో టీడీపీలో చేరనున్నారు.



పెద్దిరెడ్డీ గో బ్యాక్ అంటూ ఈనెల 15వ తేదీన పుంగనూరులో నిరసన చేపట్టిన టీడీపీ శ్రేణులు

టీడీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన ఈ రెండు పరిణామాలు నియోజకవర్గంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టు సడలుతోందనేందుకు నిదర్శనాలు.

పుంగనూరు, జూన్ 27: పుంగనూరులో ప్రత్యర్థులు ఎదురుతిరగకుండా గత 15 ఏళ్లుగా నిర్మించుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సామ్రాజ్యపు కంచుకోట బద్దలవుతోంది. ఊహించని విధంగా సార్వత్రిక ఎన్నికల్లో చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు స్వల్ప ఆధిక్యతతో పుంగనూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆయన నాలుగోసారి గెలుపొందారు. వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయాలను, అధికారాన్ని శాసిస్తూ పార్టీ, ప్రభుత్వంలో ఎదురులేని వారిగా చెలామణి అయ్యారు. గతంలో పెద్దిరెడ్డి ఆదేశాలను శిరసావహిస్తూ నాటి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్ఐలు, కొందరు రెవెన్యూ, మున్సిపల్, సబ్‌రిజిస్ట్రార్, తదితర అధికారులు ప్రతిపక్షాలకు చెందిన వారిని ఇబ్బంది పెడుతూ చుక్కలు చూపించారు. ప్రత్యక్ష, పరోక్షంగా బెదిరింపులు, అక్రమ కేసులు, దౌర్జన్యాలు, దాడులు, అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టారు. తెలుగుదేశంపార్టీ జెండా పట్టుకోవాలన్నా వణికేలా చేశారు. అన్యాయాలను ప్రశ్నించే ధైర్యం లేక టీడీపీ శ్రేణులు కుమిలిపోతూ ఆందోళన చెందుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రజలు ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి బ్రహ్మరథం పట్టారు. ఇక పుంగనూరులో అయితే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓడి గెలిచినట్లయింది. ఎందుకంటే 2009 ఎన్నికల్లో 40,299.. 2014లో 31,731.. 2019లో 43,222 ఓట్ల మెజారిటీతో పుంగనూరు నుంచి గెలిచిన ఆయనకు, ఇప్పుడు కేవలం ఆరు వేల ఓట్ల ఆధిక్యత మాత్రమే వచ్చింది.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో.. 15 ఏళ్లుగా కుమిలిపోయిన పుంగనూరు పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గతేడాది చంద్రబాబు నాయుడిని పుంగనూరులోకి రాకుండా అడ్డుపడిన పెద్దిరెడ్డిని ప్రస్తుతం తాము రానివ్వబోమని ఎదురుతిరిగారు. ఈ నేపథ్యంలో పుంగనూరులో వైసీపీ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన వస్తున్నారనే సమాచారంతో ఈనెల 15న టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పెద్దిరెడ్డి గోబ్యాక్ అంటూ నిరసనకు దిగాయి. దీంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుంచి పుంగనూరుకు రాలేని పరిస్థితితో వాయిదా వేసుకున్నారు. గతంలో కుప్పంలో ఎమ్మెల్యేగా చంద్రబాబునాయుడును పర్యటించకుండా అడ్డుకోవడం, అలాగే పుంగనూరులో పలువురిని అడ్డుకుని ఇబ్బందులుపెట్టిన పెద్దిరెడ్డి ప్రస్తుతం సొంత నియోజకవర్గమైన పుంగనూరుకు రాలేకపోతున్న సంఘటన నెలకొంది. అప్పట్లో టీడీపీ శ్రేణులు, నాయకులపై అక్రమకేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడంలో అతిగా వ్యవహరించిన పలువురు వైసీపీ నేతలు కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇప్పటికీ స్వస్థలాలకు దూరంగా ఉన్నారు.

పెద్దిరెడ్డి రాజకీయ అంతం మొదలైంది: చల్లా

అధికారమదంతో ప్రజలను దోపిడీ చేస్తూ అరాచకం మొదలు పెట్టిన పుంగనూరు నుంచే పెద్దిరెడ్డి రాజకీయ అంతం కూడా మొదలైందని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మంచిపనులు, అభివృద్ధి చేసి దగ్గర కాకుండా దౌర్జన్యం, అరాచకాలు, దోపిడీ, అక్రమాలతో భయపెట్టి కాలం గడిపే రోజులు ఇక సాగవని హెచ్చరించారు. ఇప్పుడు పుంగనూరులో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తోందని, పెద్దిరెడ్డి అక్రమాలు, అవినీతి చిట్టా విప్పి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తే ఎంతటి నాయకుడైనా మట్టికరవక తప్పదన్నారు.

సొంత పార్టీలోనూ..

ఇంతకాలం అధికార భయంతో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వైసీపీలోనూ నోరు తెరిచిన వాళ్లు లేరు. ఆయన తీరుపై అసంతృప్తి ఉన్నా పైకి చెప్పుకోలేని పరిస్థితి. ఇప్పుడూ వీళ్లూ నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టారు. గురువారమైతే ఏకంగా మున్సిపల్ చైర్మన్, మరో పదిమంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేశారు. వీరంతా త్వరలో టీడీపీలో చేరనున్నారు. మరికొందరు కౌన్సిలర్లూ పార్టీ మారబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ ఐదేళ్ల కాలం మున్సిపాలిటీలో అధికారం చెలాయించే అవకాశాన్ని పెద్దిరెడ్డి కోల్పోనున్నారు. మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు, నియోజవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నేతలూ టీడీపీవైపు చూస్తున్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి త్వరలో పుంగనూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మరికొందరు వైసీపీని వీడనున్నట్లు సమాచారం.

ఇక టీడీపీతో నడుస్తామంటూ వైసీపీకి రాజీనామా చేసి చల్లాను కలిసిన కౌన్సిలర్లు



పదవులిచ్చి పవర్ లాగేసుకున్నారు

- సొంతపార్టీ నేతలపై కౌన్సిలరు విమర్శ
- వైసీపీకి 11 మంది రాజీనామా

రొంపిచెర్ల, జూన్ 27: 'మాకు వైసీపీ నేతలు పదవులిచ్చారు. కానీ పవర్ లాగేసుకున్నారు' ఇదీ ఓ కౌన్సిలరు విమర్శ. పుంగనూరులో వైసీపీ నేతల వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, 8, 1, 2, 3, 16, 27, 13, 15, 18వ వార్డు కౌన్సిలర్లు రహంతుల్లా (అమ్ము), ఎం.రామక్రిష్ణమరాజు, జె.నరసింహులు, యువకుమారి, మమత, వి.కళిదాసు మొదలియార్, ఖాన్‌నూర్జహాన్, కసురున్నీషా, మనోహర్, రేష్మ గురువారం వైసీపీకి రాజీనామాలు చేశారు. రొంపిచెర్లలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి చేరుకుని ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ.. తాము పదవుల్లో వున్నా పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డితో పట్టణం అభివృద్ధి జరుగుతుందని ఆశాభావంతో తాము వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నట్లు పేర్కొన్నారు. తాము ఏ పోలీసు కేసులకు భయపడి రావడంలేదని, కేవలం అభివృద్ధే లక్ష్యంగా వస్తున్నట్లు స్పష్టంచేశారు. వైసీపీ నాయకులు పదవులు ఇచ్చి పవర్ లాగేసుకున్నారని కౌన్సిలర్ అమ్ము తీవ్ర విమర్శచేశారు. చంద్రబాబు అభివృద్ధికి.. వ ం ం త్రి నారా లోకేశ్ యువతకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆకర్షితులై తాము టీడీపీలో చేరడానికి సిద్ధపడ్డామన్నారు. అభివృద్ధికోసం మనమంతా కష్టపడి పనిచేద్దామని చల్లా రామచంద్రారెడ్డి వారికి చెప్పారు. 25 సంవత్సరాలుగా వైసీపీ నాయకులు కుటుంబ పాలనతో అధికారం తన వద్ద పెట్టుకుని ఆడించారన్నారు. పుంగనూరులో ముస్లింలను ఎన్‌డీఏకి ఓట్లు వేయవద్దని చెప్పారని.. పార్లమెంటులో మాత్రం ఎన్‌డీఏకి ఎంపీ మిథున్‌రెడ్డి మద్దతు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తండ్రీ కొడుకుల ఆటలు ఇక సాగవని, వారి చిట్టాలు బయట పెడతామన్నారు. ఎప్పుడూ న్యాయమే గెలుస్తుందన్నారు. పుంగనూరు అభివృద్ధికి సహకరించాలని కుప్పంలో సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. అన్ని డెయిరీలను నియోజకవర్గంలోకి రప్పించి రైతులకు పాల ధర లీటరుకు రూ.40 ఇప్పిస్తానని, మామిడి రైతులకు గిట్టుబాటు ధర కోసం చర్యలు తీసుకొంటానని, అక్రమ క్వారీలు అరికట్టి.. టీడీపీ వర్గీయుల నుంచి లాక్కొన్న వాటిని తిరిగి వారికే చెందేలా చేస్తానని తెలిపారు.



ఇమాం పసంద్ టన్ను రూ.3 లక్షలు



బంగారుపాళ్యం, జూన్ 27: బంగారుపాళ్యం మార్కెట్‌లో గురువారం మేలైన ఇమాం పసంద్ మామిడి టన్ను రూ.3లక్షలు పలికింది. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులోని నూర్‌బాయి మండీకి పలమనేరు మండలం రంగనాయనిపల్లికి చెందిన నారాయణశెట్టి ఒకటిన్నర టన్ను ఇమాం పసంద్‌ను తీసుకురాగా, మండీ యజమానులు వేలం పాట నిర్వహించారు. చెన్నైకి చెందిన వ్యాపారులు కేజీ రూ.300కు కొనుగోలు చేశారు. కాగా టేబుల్ రకాలైన బేనీషా కిలో రూ.30 - రూ.110, మల్లిక రూ.40 - రూ.100, కాలేపాడు రూ.30 - రూ.70, నీలం రకం మామిడి రూ.30 నుంచి రూ.70 వరకు, మేలైన కలర్ తోతాపురి కిలో రూ.30 - రూ.43, నాటి రకాలు రూ.15 - రూ.22 ధర పలికాయి. కాగా గుజ్జు పరిశ్రమకు తరలించే తోతాపురి రకం కేజీ రూ.24 పలికింది. ఇమాం పసంద్‌కు మంచి ధర రావడంతో రైతు నారాయణశెట్టి ఆనందం వ్యక్తం చేశారు.

1న ఇళ్ల వద్దకే పింఛన్లు

- పెరిగిన మొత్తం పంపిణీ

కుప్పం, జూన్ 27: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూలై ఒకటో తేదీన ఇళ్ల వద్దే అందించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం చెప్పారు. కుప్పం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతోపాటు ఇతర శాఖల ఉద్యోగుల సేవలనూ వినియోగించుకోవాలని సూచించారు. ఒక్కో ఉద్యోగికి 50 ఇళ్ల వంతున పింఛన్ల పంపిణీని అప్పగించేలా మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. సాధ్యమైనంత మేరకు ఒకేరోజు పంపిణీ పూర్తి చేయాలన్నారు. అనివార్య కారణాల వల్ల ఎవన్నా మిగిలితే రెండో రోజూ పంపిణీని కొనసాగించాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి పింఛను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పెంచిన పింఛన్ల సొమ్ము పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆ ప్రకారం.. మొదటి కేటగిరీలో వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు రూ.4వేల పింఛను.. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.వెయ్యి వంతున బకాయిలు కలుపుకొని రూ.7 వేలు పంపిణీ చేయాలన్నారు. అలాగే, పాక్షిక దివ్యాంగులకకు రూ.3 వేలనుంచి రూ.6 వేలకు, వంద శాతం దివ్యాంగులకు రూ.5 వేలనుంచి రూ.15 వేలకు, కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.5 వేలనుంచి రూ.10 వేలకు ప్రభుత్వం పింఛన్లను పెంచిందని గుర్తుచేశారు. ఆ మేరకు పింఛను సొమ్ము పెంచినవిధంగా పంపిణీ చేయాలన్నారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులును నియమించారు. ఆయన ఆరునెలల పాటు లేదా కొత్త పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించేంత వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు సహకార సంఘాలకు గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన నాన్-అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సెవెన్‌మెన్ కమిటీలు ఈనెల 8వ తేదీన, చైర్‌పర్సన్లు ఎన్.రెడ్డెమ్మ, ఎస్.నాగలక్ష్మిలతో సహా సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేసిన విషయం విదితమే. దీంతో పాలకవర్గాలు రద్దయ్యాయి. అప్పట్నుంచి రెండు సంఘాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ఇక అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి నియామకంతో కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

నెలాఖరులోగా ఎన్నికల వ్యయ వివరాలు అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఆడిట్ ఆఫీసర్ క్రిష్ణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 27: సాధారణ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులందరూ ఈ నెలాఖరులోగా తుది వ్యయ వివరాలను అందజేయాలని జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి డిప్యూటీ రిటర్నింగ్ అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్లు, ఏఆర్వోలకు ఖర్చు వివరాలు అందించాలంటూ ఇదివరకే నోటీసులు పంపామన్నారు. శుక్ర, శనివారాల్లో ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు వస్తున్నారని, అభ్యర్థులందరూ ఖర్చుల వివరాలను సంతకంతో కూడిన తుది నివేదికలు అబ్జర్వర్లకు అందించాలని అన్నారు.

రెండు వ్యాన్ల ఢీ : ముగ్గురికి గాయాలు



గుడిపాల, జూన్ 27: బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలోని ఎంసీఆర్ క్రాస్ వద్ద గురువారం రెండు వ్యాన్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. తమిళనాడు నుంచి చిత్తూరు వైపు వస్తున్న వ్యాన్ చిత్తూరు నుంచి వేలూరు వైపు వస్తున్న మరో వ్యానును ఢీకొన్నాయి. ఈ ఘటనలో కంచి ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్న చిత్తూరు గొల్లవీధికి చెందిన రాజేశ్వరి, కణ్ణన్, సౌందరి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి ఆలయ అధికారుల నిజాయితీ



పోగొట్టుకున్న నగదును భక్తులను అందజేస్తున్న ఆలయ అధికారులు

తిరుచానూరు, జూన్ 27: కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు చెందిన జమున అనే భక్తురాలు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి ఆలయానికి గురువారం మధ్యాహ్నం విచ్చేశారు. దర్శనానంతరం ప్రసాదాలు స్వీకరించే కౌంటర్‌లో ఆమె పర్సును పోగొట్టుకుంది. గుర్తించిన ఆలయ అధికారులు పర్సును స్వాధీనం చేసుకుని అందులోని గుర్తింపు కార్డుల ఆధారంగా ఆలయంలోని మైక్‌సెట్‌ద్వారా అనౌన్స్‌మెంట్ చేయగా, భక్తురాలు జమున ఆలయం వద్దకు చేరుకున్నారు. పర్సులో ఉన్న రూ.28వేల నగదుతో క్రెడిట్, డెబిట్‌కార్డులను సూపరింటెండెంట్ మధు, విజిలెన్స్ ఏఎస్ఐ బ్రహ్మానందరాజు, ఆలయ సిబ్బంది అందజేశారు. ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం సహా నిందితుడితో అటవీ సిబ్బంది

భాకరాపేట, జూన్ 27: ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు ఫారెస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం చామల వెస్ట్ బీట్ బొమ్మాజీ కొండ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా.. ఎర్రచందనం తీసుకువస్తూ అటవీ సిబ్బందిని చూసి దుంగలు పడేసి పారిపోతుండగా తమిళనాడుకు చెందిన శక్తివేల్ రామస్వామిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ గాలించగా సమీపంలో ఉన్న 124 కిలోల బరువు గల ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు లోకనాథం, సదాశివయ్య, రెడ్డప్పరెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు

- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, జూన్ 27: జిల్లాలో అక్రమ మైనింగ్‌ను కట్టడి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కుప్పంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి ఆయన జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన సత్వరం సమగ్ర నివేదికను తయారు చేసి తనకు సమర్పించాలన్నారు. దీనికోసం మండలాలవారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అక్రమ మైనింగ్ కార్యాకలాపాలు జరిగినట్లు తెలిసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ దందాను అణచి వేయడానికి అధికారులు సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ మినరల్స్‌లో భాగంగా 665 లీజులకు అనుమతి ఇచ్చినట్లు మైన్స్ డీడీ ఎల్వీ ప్రసాద్ కలెక్టర్‌కు తెలిపారు. లీజుల కాలపరిమితి, ఎక్కడెక్కడ లీజులకు ఇచ్చిన స్థలం కాకుండా అదనపు స్థలంలో మైనింగ్ జరుగుతోంది, పరిమితికి మించిన అక్రమ రవాణా తదితర వివరాలన్నింటినీ వెంటనే నివేదిక రూపంలో ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హాస్టళ్లలో వసతులపై 7లోగా నివేదిక ఇవ్వండి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వసతి గృహాలలో మౌలిక వసతులపై జూలై 7వ తేదీలోగా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వసతుల కల్పనతోపాటు ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల వివరాలనూ సేకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో బి.పుల్లయ్య, డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, ఏపీసీ వెంకటరమణారెడ్డి, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుప్పం అధికారులతో సమీక్ష

కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో, నియోజకవర్గ తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలెక్టరు సుమిత్‌కుమార్ సమీక్షించారు. సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన సందర్భంగా ప్రజలనుంచి అందిన అర్జీలను పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ప్రతి సచివాలయం పరిధిలో ఒక వీఆర్వో, ఒక విలేజ్ సర్వేయర్ కలిసి ప్రతి గడపకు వెళ్లి రెవెన్యూ సంబంధమైన పాస్ బుక్ మ్యుటేషన్లు, భూమి సర్వే, ఆక్రమణలు తదితర దరఖాస్తులు స్వీకరించి, నివేదికను తయారు చేయాలన్నారు.

రామోజీకి టీడీపీ నేతల నివాళి



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 27: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావుకు టీడీపీ నేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ రామోజీరావు సామాన్య కుటుంబంలో పుట్టి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకుని ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పాత్రికేయ రంగంలో విలువలకు ప్రాధాన్యత నిచ్చి, నిజాన్ని నిర్భయంగా చెప్పారని అన్నారు. లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు చంద్రప్రకాష్, త్యాగరాజన్, సప్తగిరి ప్రసాద్, సుబ్రమణ్యం నాయుడు, మోహన్‌రాజ్, హేమాద్రి నాయుడు, సీఎం విజయ, వరలక్ష్మి, రాణి, నాగలక్ష్మి, జయచంద్రనాయుడు, యుగంధర్, విజయ్‌కుమార్, బాబు నాయుడు పాల్గొన్నారు.

సేద్యానికి మంచి రోజులు: కలెక్టరు

- పీఎంజేవై కింద మహిళా రైతులకు వ్యవసాయ ఉపకరణాల పంపిణీ



మహిళా రైతులకు టార్పాలిన్లు, డ్రమ్ములు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

కుప్పం, జూన్ 27: జిల్లాలో వ్యవసాయానికి మంచి రోజులు వచ్చాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కుప్పంలో గురువారం ఆయన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి మహిళా రైతులకు వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా షెడ్యూల్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో పీఎంజేవై కింద 1,205 మంది రైతులు లబ్ధిదారులుగా ఎంపిక కాగా, అందులో కుప్పం నియోజకవర్గంలోనే 518 మంది ఉన్నారని కలెక్టరు చెప్పారు. ఎంపికైన రైతులకు రూ.5 వేల విలువైన రెండు టార్పాలిన్లు, రూ.1,830 విలువ కలిగిన 200 లీటర్ల డ్రమ్ ఒకటి, రూ.1,020 విలువ కలిగిన చిన్న డ్రమ్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని చాలాగ్రామాలలో ఆవు పేడ, గోమూత్రం, ఇతర ప్రకృతి సంబంధమైన ఎరువులతో పంటలు సాగు చేస్తున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలు ఆరోగ్యదాయకమైనవని, విస్తృతమైన మార్కెటింగ్ కూడా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి ఇంకా రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుప్పంలో పేదరిక నిర్మూలనను సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. 2014-19లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ప్రకృతి వ్యవసాయ ఆద్యుడు సుభాష్ పాలేకర్ మన రాష్ట్రాన్ని దత్తత తీసుకుని ఆ విధానంపై వివిధ ప్రాంతాలలోని రైతులకు శిక్షణ ఇచ్చారని గుర్తుచేశారు. దీంతో కుప్పం నియోజకవర్గంలో ప్రకృతి వ్యవసాయంవైపు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయంతో చేకూరే లాభాలు, దిగుబడి, ఇతర ప్రయోజనాలను తమ సొంత అనుభవాల నుంచి మహిళా రైతులు విజయలక్ష్మి, నాగభూణమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, డీపీఎం వాసు, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ రాజ్యలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, మహిళా రైతులు పాల్గొన్నారు.

కుప్పంలో అదనపు మండలాల ఏర్పాటుకు కమిటీ

కుప్పం, జూన్ 27: కుప్పం రెవెన్యూ డివిజన్‌లో అదనంగా రెండు మండలాల ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఓ కమిటీని నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న ఈనెల 24వ తేది ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించిన సీఎం.. ప్రస్తుతమున్న నాలుగు మండలాలు కాకుండా అదనంగా కుప్పం మండలంలోని మల్లానూరు, శాంతిపురం మండలంలోని రాళ్లబూదుగూరు ప్రాంతాలను మండలాలుగా ఏర్పాటు చేసే విషయంలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే, ఈ పర్యటనకు ఒకరోజు ముందే దీనిపై కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. అంటే సొంత నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి స్థానిక ఎమ్మెల్యే కూడా అయిన చంద్రబాబు ఎంత ప్రాధాన్యమిస్తున్నారన్న విషయాన్ని ఈ ఉత్తర్వులు తెలియజేస్తున్నాయి. వీలైనంత త్వరలోనే ప్రస్తుతమున్న కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలతోపాటు అదనంగా మల్లానూరు, రాళ్లబూదుగూరు మండలాలతో కుప్పం రెవెన్యూ డివిజన్‌లోని మండలాల సంఖ్య ఆరుకు పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికార యంత్రాంగం అభిప్రాయపడుతోంది.

రాష్ట్రస్థాయి విజేతలకు రూ.లక్ష చొప్పున బహుమానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న చైతన్యకుమార్‌రెడ్డి

గంగవరం, జూన్ 27 : ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు శ్రీవాణి, మధు కళాశాలల విద్యాసంస్థల చైర్మన్ క్రిష్ణమూర్తిరెడ్డి రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. బుధవారం విడుదలైన ఫలితాలలో స్థానిక శ్రీవాణి, మధు కళాశాలల విద్యార్థులు ఎంపీసీ గ్రూపులో చేతన, కరిష్మ 470 మార్కులకు 466, బైపీసీలో అల్బిన్ 440 మార్కులకు 436, సీఈసీలో ఫిజ్జా అంజుమ్ 500 మార్కులకు 486 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో పేరు సాధించారు. పలమనేరు పరిసరప్రాంతాల్లో అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. టాపర్లుగా నిలిచిన వారికి జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి దుశ్శాలువాలు కప్పి సత్కరించి కళాశాల తరఫున ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఆనందరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం, దినేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థలో చిరుధాన్యాలను చేర్చాలి



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

తిరుపతిరూరల్, జూన్ 27: చిరుధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగం చేయడం ద్వారా సాగు విస్తీర్ణం పెంచవచ్చని భారత వ్యవసాయ పరిశోధనామండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ పేర్కొన్నారు. తిరుపతిలోని వెటర్నరీవర్సిటీలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సును గురువారం అయన ప్రారంభించి మాట్లాడారు.దేశవ్యాప్తంగా చిరుధాన్య పంటలసాగు తక్కువగా ఉన్నప్పటికీ ఉత్పాదకత అధికంగానే ఉందని తెలిపారు.5వేల సంవత్సరాలుగా సాగులో ఉన్న పంటగా సజ్జకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ ఏపీలో ప్రతిజిల్లాలో ఒక్కొక్కరకం చిరుధాన్యపంట సాంప్రదాయపంటగా సాగులో ఉందని, ఐసీఏఆర్ సహకారంతో వర్సిటీపరిధిలోని నాలుగు పరిశోధనాస్థానాల్లో చిరుధాన్యాలపై పరిశోధనలు చేస్తూ అనువైన చిరుధాన్య రకాలను, సాగుకు అవసరమైన సాంకేతికతను అందిస్తున్నామని తెలిపారు.పోషకాహార భద్రతలో చిరుధాన్య పంటల పాత్ర ఎక్కువగా ఉందని, కొవిడ్-19 తర్వాత చిరుధాన్య ఆహారంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్కే ప్రధాన్ మాట్లాడుతూ ఉత్పాదకత పెంచితే చిరుధాన్యాల సాగు లాభదాయకమవుతుందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ,ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్,ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీవ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, 220మంది పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై తిరుపతి కార్పొరేషన్ కొరడా



గాంధీరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై తిరుపతి నగరపాలక సంస్థ కొరడా ఝుళిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణకు పురిగొల్పి చిరువ్యాపారులనుంచి నెలవారీ మామూళ్లను అధికార పార్టీ నేతలు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై దృష్టిసారించింది. టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబు పార్టీ శ్రేణులతో కలసి ఐదు రోజుల క్రితం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌తో పాటు టీటీడీ ఈవోకు, ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.దీంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. స్మార్ట్ సిటీ నిధులతో పాదచారులకోసం అభివృద్ధి చేసిన ఫుట్‌పాత్‌లు చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. బాటసారులకు నడిచేదారిలేక అవస్థలు పడుతున్నారు.చాలాచోట్ల ఫుట్‌పాత్‌లపై శాశ్వత నిర్మాణాలు చేపట్టి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రహదారిపైకి వచ్చే వాహనాలు వేగంగా వెళ్లడంతో బాటసారులు నడిచే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డులో మొదలైన ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు గురువారం గాంధీరోడ్డుకు చేరుకుంది. విష్ణునివాసం, గోవిందరాజ స్వామి ఆలయం, గాంధీరోడ్డు వరకు కార్పొరేషన్ అధికారులు పోలీసు బలగాలతో కలసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఇప్పటివరకు 60కిపైగా ఆక్రమణలు తొలగించినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి బాలసుబ్రమణ్యం చెప్పారు. కొన్ని చోట్ల వైసీపీ, వామపక్ష నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు ముందుకు పోతున్నారు.

గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతుల కారణంగానే వైసీపీ నేతలు దందాలు చేసి తోపుడు బండ్ల దగ్గర వసూలు చేశారంటున్న వామపక్ష నాయకులు తొలగింపును తాము స్వాగతిస్తామంటున్నారు. అయితే ఎన్డీఏ కూటమి నేతలు కూడా ఫుట్‌పాత్‌లపై బండ్లుపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదంటున్నారు. ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియ అని శుక్రవారం బైరాగిపట్టెడ, ఆ తర్వాత తిరుమల బైపాస్ రోడ్డువైపు వెళ్లనున్నట్టు కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే తోపుడు బళ్ల వ్యాపారం కోసం ప్రత్యామ్నాయంగా ప్రత్యేక హాకర్ జోన్స్ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఆ దిశగా కూడా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాల్సి వుందని పలువురు సూచిస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌కు తమిళనాట నో ఎంట్రీ

- తడనుంచి పికప్ వ్యాన్లలో చెన్నైకి ప్రయాణికుల తరలింపు
- ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లను ఒప్పుకోని తమిళనాడు అధికారులు
- కేసుల భయంతో తడ నుంచే రాకపోకలు సాగిస్తున్న బస్సులు
- పర్మిట్లు లేకుండా దర్జాగా తడకు వచ్చి వెళ్తున్న పికప్ వ్యాన్లు

తడ, జూన్ 27 : ప్రైవేట్ బస్సులకు ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లపై తమిళనాడు ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. దీంతో ఆ బస్సుల్లో ప్రయాణికులు తడ నుంచి చెన్నైకి పికప్ వ్యాన్లలో రాకపోకలు సాగించాల్సివస్తోంది. చెన్నై నుంచి తడ మీదుగా హైదరాబాదు, వైజాగ్, విజయవాడ ప్రాంతాలకు సుమారు 75కు పైగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.ఆలిండియా పర్మిట్ ద్వారా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల పేరుతో ఇవి ఎక్కడైనా ప్రయాణించే అవకాశం ఉంది. అయితే తమిళనాడు, ఏపీ, తెలంగాణా పరిధిలో ప్రయాణించే చాలా బస్సులు ఆయా రాష్ట్రాల్లో పర్మిట్లు పొందకుండా ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాకపోకలు సాగిస్తున్నాయి.ఈశాన్య రాష్ట్రాలలో పర్మిట్ పన్నుల వసూళ్లు తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. వాస్తవంగా ఏపీలో ఒక బస్సు సీట్‌కు 3 నెలల కాల వ్యవధికి సుమారుగా 3,500 రూపాయల వరకు పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండగా, తమిళనాడులో సుమారుగా 3,200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం ఒక సీట్‌కు కేవలం 400 రూపాయల లోపే పర్మిట్ రూపేణా చెల్లించాల్సి ఉండటంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు అక్కడ పర్మిట్లు పొందుతున్నారు. పైగా ఆ రాష్ట్రాల్లో బస్సుల తనిఖీ ఉండదు. బస్సులు ఎక్కడో ఉన్నా మధ్యవర్తుల సహాయంతో కొంతసులభంగా ఆయా రాష్ట్రాల పర్మిట్లు దొరుకుతాయి. దీంతో మనరాష్ట్రంలో 40 సీట్లుగల ఒక బస్సుకు 3 నెలల కాలానికి సుమారు 1.40 లక్షలు చెల్లించాల్సి ఉండగా, అదే బస్సుకు ఈశాన్య రాష్ట్రంలో కేవలం 16వేల రూపాయలకే పర్మిట్ అందుబాటులోకి వస్తుంది. ఇలాంటి బస్సులపై తమిళనాడు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. చెన్నై నుంచి ఏపీ, తెలంగాణాలకు వెళ్లినట్లుగానే తమిళనాడులోని వివిధ ప్రాంతాలతోపాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వందల సంఖ్యలో ప్రైవేట్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి.ఇటీవల ఒడిశా, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పర్మిట్ పొందిన బస్సులపై తమిళనాడు ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. తమిళనాడు పర్మిట్లు సైతం పొందాలంటూ మెలిక పెడుతోంది. దీంతో ఆయా బస్సులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. చెన్నై నుంచి తడ మీదుగా రాకపోకలు సాగించే ఈ ప్రైవేట్ బస్సులను తడ వద్దే నిలిపివేసి పికప్ వ్యాన్ల ద్వారా ప్రయాణికులను అటుఇటు తరలిస్తున్నాయి.



తడ కరిపేటి కాలువ సమీపంలో నిలిచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

పర్మిట్ లేకున్నా దర్జాగా రాకపోకలు

ఏపీలో రవాణాశాఖ చెక్‌పోస్టులను గత మార్చి నెలలో ప్రభుత్వం మూసివేసింది. తద్వారా వాహనాలు తనిఖీ చేసే అధికారులు లేకపోవడంతో కొందరు వాహనదారులు పర్మిట్లు లేకుండానే మనరాష్ట్రంలోకి వచ్చి వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా శ్రీసిటీ, నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ వరకు వందల సంఖ్యలో వాహనాలు పర్మిట్లు లేకుండానే రోజూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పుడు ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు సైతం ఆ పద్ధతినే అనుసరిస్తున్నాయి. ఏపీలోకి పర్మిట్లు లేని పికప్ వ్యాన్లలో ప్రయాణికులను తడ-చెన్నైల మధ్య తరలిస్తున్నాయి. ఓ పక్క ఈశాన్య రాష్ట్రాల పర్మిట్లతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా తాజాగా పర్మిట్లు లేని ఈ పికప్ వ్యాన్లు సైతం వచ్చి వెళ్తూ మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పైగా ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి పూర్తిస్థాయిలో బస్సు చార్జీలను వసూలు చేస్తూ చెన్నై- తడ మధ్య పికప్ వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇకనైనా రవాణాశాఖ అధికారులు పర్మిట్‌లేని పికప్ వ్యాన్లపై చర్యలు తీసుకోవడమేకాకుండా తమిళనాడు తరహాలో ఈ బస్సుల నుంచి పర్మిట్ల రూపేణా పన్నులు వసూలు చేయాల్సివుంది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

జీవో నెం.117ను రద్దు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ అధ్యక్షుడు బాబురెడ్డి

పెద్దపంజాణి, జూన్, 27: విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా మారిన జీవో నెం.117 రద్దు చేయాలని ఎస్టీయూ అధ్యక్షుడు బాబురెడ్డి అన్నారు. గురువారం పెద్ద పంజాణిలో మండల ఎస్టీయూ ఉపాధ్యాయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న జీవోను వెంటనే రద్దుచేయాలని కోరారు. అలాగే ఉన్నత పాఠశాలలో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాల న్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్టీయూ నాయకులు మోహన్, గురుప్రసాద్, నారాయణస్వామి, శివ ప్రసాద్, అంజాద్అలీఖాన్, శ్రీనివాసులు, నాగరాజ, లక్ష్మీపతి, బాలాజి, మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనబరచిన ఐఆర్ఎం విద్యార్థులు

కుప్పం, జూన్ 27: గురువారం విడుదలైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలలో కుప్పంలోని ఐఆర్ఎం జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ బిఎం.దయానిధి తెలిపారు. ఎంపీసీలో ఎస్.శ్రేయ (444 మార్కులు), సీఈసీలో బి.రాగిణి (456), బైపీసీలో ఎస్.మేఘన (401), ఎంపీసీలో వి.మౌనిక (443) మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

చదువుతోనే ఉన్నతస్థాయికి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పలమనేరు, జూన్27 : చదువుతోనే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని జిల్లా ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. పలమనేరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో గురువారం 'నేనూ బడికి పోతా' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో బాల సుందరం, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, సీఆర్సీ జాయింట్ కార్యదర్శి మునాఫ్ విద్యార్థులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బడి మానేసిన పిల్లలందరూ పాఠశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూఆర్డీయూ సీఆర్సీ పరిధిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంపింగ్, ఫిల్టర్ కేంద్రం వద్ద పారిశుధ్య పనులు



పలమనేరు, జూన్27 : పలమనేరు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్, పంపింగ్ కేంద్రంలో లోపించిన పారిశుధ్యంపై గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి స్పందించారు. పారిశుధ్య కార్మికులతో వాటర్ ఫిల్టర్, పంపింగ్ కేంద్రం వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రపరిచారు.

పెద్దపంజాణిలో లోపించిన పారిశుధ్యం



అధ్వానంగా మారిన సచివాలయానికి వెళ్లే దారి

పెద్దపంజాణి, జూన్27: మండలంలోని అన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండాల్సిన మండల కేంద్రంలోనే పారిశుధ్యం లోపించింది. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు లేరు. పెద్దపంజాణిలో పూర్తి స్థాయిలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో మురుగునీరుకు తోడు వర్షపు నీరు నిల్వచేరింది. ఫలితంగా అంటురోగాలు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామంలోని బీసీ, మైనార్టీ కాలనీలలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సచివాలయ వెనుక వీధి, నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనం దారి అధ్వానంగా మారాయి.

ఛత్రపతి శివాజీ శోభాయాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న హిందూజాగరణసమితి సభ్యులు

పుంగనూరు రూరల్, జూన్27: ఈ నెల 30న పుంగనూరులో నిర్వహించే ఛత్రపతి శివాజీ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందుజాగరణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఛత్రపతి శివాజీ శోభా యాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందువులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

పలమనేరు, జూన్27 : ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 4,682 మంది పెన్షన్‌దారులు ఉన్నారని వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 సచివాలయాల్లో 104 మంది సిబ్బంది పనిచేస్తున్నారని వీరి ద్వారా పింఛన్లు అందిస్తామని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు వెయ్యి చొప్పున మూడు నెలలకు మూడువేలు అదనంగా ఇస్తామన్నారు. మొత్తం రూ. 7వేలు చొప్పున పెన్షన్లు పంపిణీ చేస్తామని వివరించారు.

ఆర్బీకేలో ఎల్ఈడీ టీవీ చోరీ

బైరెడ్డిపల్లె, జూన్ 27: మండలంలోని గంగినాయనిపల్లె రైతుభరోసా కేంద్రంలో బుధవారం రాత్రి ఎల్ఈడీటీవీ చోరీ జరిగిందని గ్రామకార్యదర్శి నాగరాజు గురువారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదుచేశారు. తాళాలు పగలగొట్టి ఎవరో దుండగులు చోరీకి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటవీశాఖ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, జూన్ 27: బైరెడ్డిపల్లె నాలుగురోడ్ల కూడలి సమీపంలో అటవీశాఖకు చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించు కుంటున్నారని వి.కోట డీఆర్వో గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖకు చెందిన స్థలంలో అక్ర మంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలియజేశారు. ప్రశ్నించిన తమ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా బాబు



రామకుప్పం, జూన్ 27: రేషన్ డీలర్ల రామకుప్పం మండల కొత్త కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా రామకుప్పం షాప్ నంబర్- 1డీలర్ బాబు, ప్రధానకార్యదర్శిగా చెల్దిగానిపల్లె డీలర్ అమరేష్, ఉపాధ్యక్షుడిగా వెంకటాచలపతి, కోశాధికారిగా రుక్మాంగధరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పార్వతమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా హరినాయక్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సదుం, జూన్ 27: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన గురువారం సదుంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం టి.వడ్డూరుకు చెందిన బాబు పీలేరులోని తన బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పీలేరు-సదుం మార్గం తాటిగుంటపాళెం రోడ్డులోని చెరువు కట్ట మలుపు వద్ద వస్తుండగా సదుం నుంచి పీలేరు వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. గాయపడిన బాబును 108లో పీలేరు ఆస్పత్రికి తరలించారు.

చౌడేపల్లె పంచాయతీకి రూ.7.33 లక్షలు ఆదాయం

చౌడేపల్లె, జూన్27: చౌడేపల్లె సంతగేటు వేలం ద్వారా రూ.7.33లక్షలు ఆదాయం చేకూరినట్లు ఈవోఆర్డీ కృష్ణవేణి పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ చౌడేపల్లె సంతగేటు 9 నెలలకు గాను రూ.7,33,875లకు భవానిసింగ్ దక్కిం చుకున్నారు. బస్టాండు వేలం పాట గత ఏడాది కన్న తక్కుగా 1.30 లక్షలు రావండతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపి వారి ఆదేశాలతో తదుపరి నిర్ణయం తీసు కోనున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సదుం వాల్మీకి వీధిలో విషాదం

సదుం, జూన్ 27: ఒకే రోజు వ్యవధిలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందడంతో వాల్మీకి వీధి వాసుల్లో విషాదం నెలకొంది. వాల్మీకి వీధికి చెందిన కృష్ణయ్య ఒక్కగానొక్క కుమారుడు వెంటకరమణ(25) గత మంగళవారం పులిచెర్ల మండల పరిధిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే వీధికి చెందిన రెడ్డెప్ప కుమారుడు రవి తిరుమల శ్రీవారి కళ్యాణ కట్టలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తూ మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరేలోపు బుధవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. రోజు వ్యవధిలో ఇద్దరు యువకులు అకాల మరణం చెందడంతో వాల్మీకి వీధి వాసుల్ని విషాదంలో ముంచేసింది.

వైభవంగా అమ్మవార్ల దీపారాధనలు



పెద్దమ్మతల్లికి దీపారాధన, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శాంతిపురం. జూన్ 27 : మండల పరిధిలోని మఠం పంచాయితీ పొన్నేపల్లె గ్రామంలో వెలిసిన సల్లాపురమ్మ, పెద్దమ్మ, యల్లమ్మ, చౌడేశ్వరమ్మ, కాటేరమ్మ అమ్మవార్లకు భక్తులు దీపారాధనలతో పూజలు చేశారు. గురువారం పొన్నేపల్లె గ్రామంలో గంగమ్మజాతర జరిగింది. గ్రామంలో ఉదయం భక్తులు అమ్మవార్ల ఆలయాల వద్ద దీలు, బోనాలు సమర్పించారు. అంతకు ముందు రోజు బుధవారం అర్ధరాత్రి పలువురు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. గ్రామంలో అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా రాత్రి భక్తుల కాలక్షేపం కోసం నిర్వహించిన ఆర్కెస్ట్రా, డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిజాయతీగా పనిచేయండి

సీఎం పర్యటనలో అందిన అర్జీలను వెంటనే పరిష్కరించండి ● కలెక్టర్





రెవెన్యూ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, హాజరైన రెవెన్యూ అధికారులు

కుప్పం, జూన్ 27: ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, నిజాయితీతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ అధికారులను, వివిధ స్థాయిలలోని సిబ్బందికి సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల కుప్పం పర్యటన సందర్భంగా ప్రజల నుంచి అందిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన కుప్పం ఆర్డీవో, నియోజకవర్గ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో ఏ మాత్రం అలక్ష్యం తగదన్నారు. ఇన్నాళ్లూ ఎవరైనా అలసత్వం ప్రదర్శించి ఉంటే పనితీరును మార్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా అందిన అర్జీలను ఆర్డీవోకు పంపుతామన్నారు. ఆయన నుంచి ఆయా మండలాలకు అర్జీలను విభజించి అందేజేస్తారన్నారు. ఈ వినతులతోపాటు కుప్పం నియోజకవర్గంలో డ్రైవ్ తరహాలో ప్రతి సచివాలయంలో ఒక వీఆర్వో, ఒక విలేజ్ సర్వేయర్ బృందంగా ఏర్పడి ఆ సచివాలయ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి రెవెన్యూ సంబంధమైన పాస్ బుక్ మ్యుటేషన్లు, భూమి సర్వే, ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి, నివేదికను తయారు చేయాలని సూచించారు. ఈ నివేదికల్లోని సమస్యలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు జూలై నెల 15వ తేదీలోగా తమ పరిధిలో పరిష్కరించగల వినతులు, సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ధ్రువపత్రాల పంపిణీకి సంబంధించి పెండింగులో ఉన్నవాటికి ఆమోదం తెలిపి వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, కుప్పం ఆర్డీవో జి.శ్రీనివాసులు, సర్వే ఏడీ గౌస్ బాషా పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన ఉండాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జూన్ 27 : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉండాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం శాంతిపురం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపాలంటే ఉపాధ్యాయులకే సాధ్యమన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ మంజునాథ్, ప్రిన్సిపాల్ లత, ఎంఈవో గోవిందరాజులు, సర్పంచ్ బాలక్రిష్ణ, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి మణి, ఏఎంసీ నాగరాజు, నడింపల్లె గోవిందరాజులు, మాజీ ఎంపీటీసీ రామచంద్రనాయుడు, రాజప్ప, తుమ్మిశి శేఖర్, నాగరాజు, నోబెల్ స్కూల్ కరస్పాండెంట్ సురేష్‌కుమార్, రమేష్, హరినాథ్‌రెడ్డి, చలపతి, టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి, మురుగేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ బలోపేతం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న వెంకటాచలం

రామకుప్పం, జూన్ 27: ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకంలో మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతమవుతుందని తెలుగుయువత రామకుప్పం మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, టీడీపీ ముద్దనపల్లె పంచాయతీ అధ్యక్షుడు రఘు తెలిపారు. గురువారం వారు ముద్దనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాడు-నేడు పేరిట ప్రచార ఆర్భాటం తప్ప పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడలేదన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇక్కట్ల పాలయ్యారన్నారు. ఇకపై విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండాలని కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ట్రాక్టరు మురళి, సనావుల్లా, మురళి, ప్రధానోపాధ్యాయులు దూర్వాసులు, ఉపాధ్యాయులు షేక్‌బాబు, రవికుమార్, భారతి, కేశవులు, శేషారెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ రవికుమార్

పుంగనూరు రూరల్, జూన్27: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పుంగనూరు ఏపీడీ రవికుమార్ సూచించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు చేయడంలో పుంగనూరు మండలం చాలా వెనుకబడిందని, పనులు వేగవంతం చేయని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు అవసరమైన పనులు గుర్తించి పనులు చేపట్టాలని సూచించారు. ఏపీవో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఆపరేటర్‌కు జీతాలు చెల్లించండి



సోమల దళితవాడలో మినరల్ వాటర్ ప్లాంట్

సోమల, జూన్ 27: సోమల దళితవాడలో 2022 మార్చి నెలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పథకం ఆపరేటర్‌కు ఇంత వరకు నెలవారి జీతం చెల్లించలేదని గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు మొరపెట్టుకున్నాడు. ప్లాంట్ మరమ్మతులు సొంతంగా చేస్తున్నా అధికారులు స్పందించడంలేదని వాపోయారు. అధికారులు స్పందించి రెండేళ్ల జీతాలు మంజూరు చేయాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయం పక్కనే చెత్తాచెదారం



చౌడేపల్లె, జూన్27: ఎంపీడీవో కార్యాలయం పక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. గురువారం మండల పరిపాలన భవనం, తహసీల్దార్ కార్యాలయం, సచివాలయం-2 పక్కనే చెత్తా చెదారం నిండిపోయింది. ఇక్కడే ఇలా ఉంటే ఇక పంచాయతీలను ఏం పట్టించుకుంటారని కార్యాలయానికి వస్తున్న జనం చర్చించు కుంటున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



ఇర్లపల్లెలో బడిఈడుపిల్లలతో టీచర్లు

సోమల, జూన్ 27: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో శివరత్న తెలిపారు. గురువారం మండలంలోని ఆవులపల్లె పంచాయతీ ఇర్లపల్లెలో 'నేను బడికి పోతా' కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగారు. బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా అడిగే హక్కు జగన్‌కు లేదు: టీడీపీ

గంగాధరనెల్లూరు, జూన్ 27: ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని తెలుగు యువత దేవపత్ని ధనంజయనాయుడు, టీడీపీ వాణిజ్య విభాగం కామసాని కోదండరెడ్డి, ముస్లిం మైనారిటీ విభాగం నియాజ్‌అలీ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డిలు విమర్శించారు. గత అసెంబ్లీలో తాను తలచుకుంటే 23 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురిని లాగేసుకుంటే ప్రతిపక్ష హోదాయే ఉండదు బాబు అన్న జగన్‌రెడ్డి ఇప్పుడే ఏ ముఖం పెట్టుకుని ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖ రాశారో చెప్పాలని ప్రశ్నించారు. ఘోర ఓటమి పాలైన జగన్ ఆత్మపరిశీలన చేసుకుని ముందుకు వెళ్లాలే తప్ప సింపతీ కోసం ప్రయత్నించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

అలరించిన అర్జున తపస్సు



కల్లూరు, జూన్ 27: పులిచెర్ల మండలం కల్లూరులో కొనసాగు తున్న మహా భారత యజ్ఞంలో భాగంగా గురువారం అర్జున తపస్సు ఉత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. తపస్సు మానును అధిరోహించిన అర్జున పాత్రధారి జోలెలో తీసుకెళ్లిన నిమ్మపండ్లు, పూలు, తదితర పూజా సామగ్రిని భక్తులపై విసిరారు. వీటిని అందుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. వీటిని తింటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఆలయాధికారులకు చెక్కు అందజేస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూన్ 27: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి చిత్తూరుకు చెందిన రమక్క, నరసింహులునాయుడు గురువారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును ఆలయాధికారులకు అందజేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

మలుపులు...ప్రమాదాల నిలయాలు

సదుం, జూన్ 27: సదుం గ్రామ సరిహద్దులోని ప్రమాదకర మలుపులు తరచూ ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సదుం-కల్లూరు ప్రధాన రహదారిలో భట్టువారిపల్లె గుట్ట మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ తరచూ జరిగే ప్రమాద ఘటనల్లో క్షతగాత్రుల కన్నా మృత్యువాతపడుతున్న వారి సంఖ్య ఎక్కువ. సదుం -పీలేరు మార్గంలో కొత్తపల్లె క్రాస్ మలుపు వద్ద వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సదుం-సోమల ప్రధాన రహదారిలో నాగిరెడ్డి చెరువు కట్ట వద్ద ఉన్న మలుపు అత్యంత ప్రమాదభరితంగా ఉన్నది. ఇక కలికిరి, పీలేరు వైపు నుంచి సదుంలోకి వచ్చే మార్గంలో ప్రాథమిక పాఠశాల, చెన్నకేశవస్వామి గుడి, బస్టాండుకు ఇరువైపులా ఉన్న మలుపులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లతో ఎదురుగా వచ్చే వాహనాలు వాహనదారుల‌కు కనిపించకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా తలుస్తోంది. మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లుగానీ, కనీసం రోడ్డు భద్రత సూచికలుగానీ లేవు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర మలుపుల వద్ద రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.







సదుం-కల్లూరు మార్గంలో భట్టువారిపల్లె వద్ద ప్రమాదకర మలుపు ● సదుం-పీలేరు మార్గంలో కొత్తపల్లె క్రాస్ వద్దనున్న మలుపు ● సదుం బస్టాండు వద్దనున్న మలుపు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రజలను విస్మరిస్తే బుద్ధి చెబుతారు



తహసీల్దార్‌కు ఫొటోలను అందజేస్తున్న నేతలు

గంగాధరనెల్లూరు, జూన్ 27: ప్రజలను విస్మరించి పాలన సాగిస్తే ఎంతటి నేతనైనా దూరం పెడతారనడానికి మాజీ సీఎం జగనే ఉదాహరణ అని టీఎన్ఎస్ఎఫ్ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు శేఖర్, జనసేన కన్వీనర్ సురేష్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవి, హౌసింగ్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏఈ దాములకు గురువారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను అందజేశారు. కూటమి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు.

ప్రతిపక్ష హోదా అడిగే హక్కు జగన్‌కు లేదు

గంగాధరనెల్లూరు, జూన్ 27: ప్రతిపక్ష హోదా అడిగే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని తెలుగు యువత దేవపత్ని ధనంజయనాయుడు, టీడీపీ వాణిజ్య విభాగం కామసాని కోదండరెడ్డి, ముస్లిం మైనారిటీ విభాగం నియాజ్‌అలీ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డిలు విమర్శించారు. గత అసెంబ్లీలో తాను తలచుకుంటే 23 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురిని లాగేసుకుంటే ప్రతిపక్ష హోదాయే ఉండదు బాబు అన్న జగన్‌రెడ్డి ఇప్పుడే ఏ ముఖం పెట్టుకుని ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖ రాశారో చెప్పాలని ప్రశ్నించారు. ఘోర ఓటమి పాలైన జగన్ ఆత్మపరిశీలన చేసుకుని ముందుకు వెళ్లాలే తప్ప సింపతీ కోసం ప్రయత్నించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

యువకుడి ఆచూకీ తెలపండి



చరణ్‌కుమార్

చిత్తూరు, జూన్ 27: ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడి ఆచూకీ తెలపాలని ఒకటో పట్టణ పోలీసులు కోరారు. వారు చెప్పిన వివరాల మేరకు.. నగరంలోని శరవణపురానికి చెందిన చరణ్‌కుమార్(22) గురువారం ఉదయం బస్టాండుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అనంతరం తాను చనిపోతున్నట్లు కుటుంబ సభ్యుల ఫోన్‌కు మెసేజ్ చేశాడు. ప్రస్తుతం అతని ఫోన్ పనిచేయడం లేదు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే 9440796707కు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

షర్మిలను కలిసిన ఎంఎస్ బాబు



చిత్తూరు రూరల్, జూన్ 27: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గురువారం కలిశారు. పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట తవణంపల్లి ఎంపీపీ రవి, నాయకులు లక్ష్మీ ప్రసన్న, వెంకటేష్ తదితరులు ఉన్నారు.



సచివాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు



ఉద్యోగులకు చిత్రపటాలను అందిస్తున్న నేతలు

పాలసముద్రం, జూన్ 27: మండలంలోని తొమ్మిది సచివాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు చిత్ర పటాలను టీడీపీ నాయకులు గురువారం సచివాలయాల ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వాసు నాయుడు, అరుళ్‌నాథన్, మణి నాయుడు, రోసి నాయుడు, వెంకటేశులు నాయుడు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు తరలిరండి

పాలసముద్రం, జూన్ 27: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన వేడుకలను శుక్రవారం పాలసముద్రంలో నిర్వహించనున్నామని, పార్టీ శ్రేణులు తరలిరావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

చిత్తూరు, జూన్ 27: చిత్తూరు ప్రభుత్వ ఆయుష్ మెడికల్ అధికారులు గురువారం తపోవనం పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, డయేరియాపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద హోమియో, యునాని మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు శ్రీవాణి, హరిత, జగదీశ్ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ



మేషాక్‌ను పరామర్శిస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, జూన్ 27: అనారోగ్యం పాలైన టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మేషాక్‌ను టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ గురువారం పరామర్శించారు. స్వగ్రామమైన ముత్తుకూరుకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు శశికర్‌బాబు, కుమార్, రాజేష్, రాజా, శ్రీనివాసులు ఉన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

నగరి, జూన్27: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని నగరి ఏరియా వైద్యశాల పారిశుధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ నాయకుడు కోదండయ్య ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఎన్నిసార్లు ఉద్యమాలు చేసినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని, కొత్త ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. వేలన్, సుమతి, ఉష, నవోమి, మల్లిగమ్మ, చంద్రమ్మ సెల్వి పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే శిక్షిస్తాం

చిత్తూరు సిటీ, జూన్27: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సారా, మద్యం, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, గ్యాంబ్లింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లాటరీ వంటికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా గుండాలమ్మ వసంతోత్సవాలు

చిత్తూరు కల్చరల్, జూన్ 27: అశోక్‌పురం పోలీస్‌లైన్ గుండాలమ్మ జాతర మూడు రోజులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, వసంతోత్సవాలు నిర్వహించారు.

వర్షాకాలం ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, జూన్ 27: పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని, వర్షాకాలం వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గిరింపేట ఉన్నత పాఠశాలలో గురువారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున కాచి చల్లార్చిన నీటిని, తాజా ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కమిషనర్ అరుణ చేతులు శుభ్రపరిచే ఆరు ప్రక్రియలను వివరించారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్‌ఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలకు వెంటనే పరిష్కారం..

విద్యార్థులు చెప్పిన పలు సమస్యలకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిష్కారం చూపారు. నగర శివారులోని కొత్తపల్లె, వైఎస్సార్‌కాలనీ, ప్రశాంత్ నగర్ నుంచి ఆటోల్లో రావడం కష్టంగా ఉందని, ఆర్టీసీ సర్వీసును నడిపితే బాగుంటుందని విద్యార్థులు కోరగా ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో క్రాఫ్ట్ మిషన్ లేకపోవడంతో పాఠ్యాంశాలు నేర్చుకోలేకపోతున్నామని తెలపగా సొంత నిధులతో మిషన్ కొనిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే కు సన్మానం

చిత్తూరు సిటీ, జూన్ 27: ఎమ్మెల్యే జగన్మోహన్‌ను ఆ పార్టీ నేతలు గురువారం సన్మానించారు. 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కలసి గజమాలతో సన్మానించారు. 45వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చిట్టిబాబు, కార్యదర్శి జయశంకర్, బూత్ ఇన్‌చార్జి కవిత, సెల్వి పాల్గొన్నారు.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూన్ 27: అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, అంటువ్యాధుల నిర్మూలనకు ప్రణాళిక రూపొందించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. గురువారం ఆయన పూతలపట్టు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పలు గదులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారులు, వైద్యసిబ్బందిని ఆదేశించారు. మందుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు గదుల కోసం కృషి చేస్తానన్నారు. సాయంత్రం చిన్నబండపల్లి గ్రామాన్ని సందర్శించి, అస్వస్థతకు గురైన బాధితులను పరామర్శించారు. అధికారులతో సమావేశమై అస్వస్థతకు కారణం తెలుసుకుని, వైద్యసేవలు అందించాలని కోరారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు వైద్య శిబిరాలను కొనసాగించా లన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, శేషాద్రి నాయుడు, చిరంజీవి నాయుడు, బాబు, చిన్నబ్బ మండడి, రమేష్ పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోండి



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దాత

ఐరాల, జూన్ 27: దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈవో-2 దామోదర్‌నాయుడు అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన వాసుట్రస్టు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, బలపాలు అందించారు. సర్పంచ్ మల్లీశ్వరి, వాసుట్రస్టు నిర్వాహకులు ఎస్.రాజారామ్, సుబ్రహ్మణ్యం, ఎస్.ఈశ్వర్, హెచ్‌ఎం అజిత, ఎంపీటీసీ లత, జూపార్క్ మాజీ డైరెక్టర్ మణియాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ నేత మంగమ్మకు నివాళి



శ్రీరంగరాజపురం, జూన్ 27: కట్టికపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు బలగాల మంగమ్మ(70)కు టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆమె కర్మక్రియలకు చిట్టిబాబునాయుడితో పాటు జిల్లా యాదవ సాధిక సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, విశ్వనాథనాయుడు, బాలాజీ నాయుడు, వేమనాయుడు, సిద్దయ్యశెట్టి, వరదరాజు, వెంకటేష్, రవి, దామోదర్‌రెడ్డి హాజరై నివాళి అర్పించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల పంపిణీ



శ్రీరంగరాజపురం, జూన్ 27: కట్టికపల్లె గ్రామ సచివాలయానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని టీడీపీ, జనసేన నాయకులు గురువారం అందజేశారు. తెలుగు యువత కార్యదర్శి శేఖర్, టీడీపీ నాయకులు వేమనాయుడు, కె.ఎం.రవి, త్యాగరాజులు నాయుడు, లక్కుడపూడి బాబు నాయుడు పాల్గొన్నారు.

మల్లారెడ్డి కండ్రిగ అభివృద్ధికి కృషి



భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న మల్లారెడ్డి కండ్రిగ వాసులు

విజయపురం, జూన్ 27: మండలంలోని మల్లారెడ్డి కండ్రిగ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గ్రామానికి చెందిన పలువురు గురువారం ఆయన్ను తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలసి, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కలిసిన వారిలో టీడీపీ, జనసేన నాయకులు సమరసింహారెడ్డి, మునిశేఖరశెట్టి, మోహన్‌కృష్ణారెడ్డి, రాజేష్ ఉన్నారు.

మెజార్టీ తగ్గడంపై ఎమ్మెల్యే ఆగ్రహం

గుడిపాల, జూన్ 27: 'ఇంతమంది సంఘమిత్రలు ఉన్నారు.. నేను పుట్టి పెరిగిన మండలంలో మెజారిటీ రాకుండా చేశారు.. మంచి మెజారిటీ ఇచ్చి ఉంటే సంతోషంగా ఉండేది కదా' అంటూ చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సంఘమిత్రలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సంఘమిత్రలు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా వ్యాఖ్యానించారు. రామభద్రాపురం గ్రామ సచివాలయ ఉద్యోగులు, సింగిల్ విండో సీఈవో సెల్వం ఎమ్మెల్యేను సన్మానించారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, రామభద్రాపురం ఉప సర్పంచ్ సరళా వెంకటేష్ యాదవ్, నాయకులు ఈశ్వర్ నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఆలయాధికారులకు చెక్కు అందజేస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జూన్ 27: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి చిత్తూరుకు చెందిన రమక్క, నరసింహులునాయుడు గురువారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును ఆలయాధికారులకు అందజేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

జ్ఞానదీపాలు పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, జూన్ 27: తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ప్రచురించిన జ్ఞానదీపాలు పుస్తకాన్ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఆగస్టు 29వ తేదీలోపు నగరంలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తులసీనాథంనాయుడు, కార్యదర్శి పుష్ప, ధనంజయ, రాజేంద్ర, భాస్కర నాయుడు, రవి, మురళి, పరంధామ, హరినాయుడు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

చిత్తూరు కల్చరల్, జూన్ 27: నగరంలోని కట్టమంచి మెయిన్ రోడ్డుపై గురువారం భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు, జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నగరపాలక సంస్థ సిబ్బంది దాన్ని తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోండి

నగరి, జూన్27 : ప్రాథమిక సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు రెన్యువల్ చేసుకోవాలని నగరి ప్రాథమిక సహకార సంఘం సీఈవో తులసిపిళ్లై కోరారు. సహకార సంఘాల కంప్యూటరీకరణ కారణంగా సభ్యత్వం (ఓటుహక్కు) కలిగిన రైతులు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు సంఘ కార్యాలయంలో అందించాలన్నారు. అందించని వారి సభ్యత్వం రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

వరసిద్ధుడి సేవలో చీపురుపల్లె ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), జూన్ 27: విజయనగరం జిల్లా చీపురుపల్లె ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు గురువారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత



కార్వేటినగరం, జూన్ 27: ఆర్‌కేవీబీ పేట గ్రామ సచివాలయానికి సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గురువారం అందజేశారు. మంచి పరిపాలన అందించాలని గ్రామ కార్యదర్శిని కోరారు. హేమంత్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, దామోదరం, రాఘవ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కార్వేటినగరం, జూన్ 27: కార్వేటినగరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుత్తూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ రూ.17 వేల విలువైన విద్యా సామగ్రిని అందించింది. సంస్థ సభ్యురాలు జ్యోతి ఎంఈవో విజయ్‌కుమార్ చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందించారు. హెచ్‌ఎం లాలా కుమారి పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై దృష్టి పెట్టండి

నింద్ర, జూన్ 27: మండల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రజలు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పక్కదారి పట్టిందని, దాన్ని గాడిలో పెట్టాలని అంటున్నారు. శుక్రవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశంలో దీనిపై చర్చించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరుతున్నారు. ఐదేళ్లుగా సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారడంతో స్వచ్ఛనీరు అందడం లేదని, గ్రామీణ రోడ్లు దారుణంగా ఉన్నాయని, 24 గంటలు వైద్య సేవలు అందడం లేదని, అర్హులకు ఇంటి పట్టాలు అందలేదని తెలిపారు.

ఘనంగా గంగ జాతర

నింద్ర, జూన్ 27: మిట్టకండ్రిగ గ్రామంలో గురువారం గంగ జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన ఊరేగింపులో ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. గురువారం ఉదయం భక్తులు వెయ్యి కళ్ల దుత్తల్లో దీపం వెలిగించి, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని గ్రామ పొలిమేరలో నిమజ్జనం చేశారు. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

చంద్రప్రభపై కోదండరాముడి విహారం



తవణంపల్లె, జూన్ 27: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. మేళతాళాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తుమ్మింద గంగ జాతర

చిత్తూరు రూరల్, జూన్ 27: చిత్తూరు రూరల్ తుమ్మింద గ్రామంలో గంగ జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు యాదమరి, గుడిపాల, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేయించారు. ఎంపీటీసీ రఘు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇప్పించండి

బంగారుపాళ్యం, జూన్ 27: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పదవి తమకు కేటాయించాలని ఈడిగ బీసీ సాధికారిక సమితి అధ్యక్షుడు బుస్సా నాగరాజ్ గౌడ్ పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌లను కోరారు. కొత్తపల్లి రెడ్డెప్ప గౌడ్, లేబాకుల మురళీగౌడ్, వేణుగోపాల్‌రావు గౌడ్, నారాయణస్వామి ఆయన వెంట ఉన్నారు.

